మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



## మున్సిపల్ ఎన్నికల్లో అధికారులు బాధ్యతతో పనిచేయాలి

● గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల్లో అధికారులు బాధ్యతతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రానికి సిబ్బంది సకాలంలో చేరుకొని రిపోర్టింగ్ చేసేలా ఆర్వోలు కృషి చేయాలన్నారు. ఆయా వార్డులకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల వారీగా బ్యాలెట్ పేపర్స్, ఎలక్ట్రోరల్ ఓటర్ జాబితా, ఇతరసామాగ్రి సక్రమంగా పంపిణీ జరిగేలా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియకు 25 శాతం అదనపు సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచినందున మాన్ పవర్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. పోలింగ్ అనంతరం రిసెప్షన్ కేంద్రానికి బ్యాలెట్ బాక్సులు తీసుకొచ్చిన తర్వాత వాటిని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీల్ వేసే వరకు రిటర్నింగ్ అధికారులు బాధ్యతతో పని చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో అలసత్వం వహించే వారిపై తగు చర్యలు తీసుకోవడంజరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జెడ్పి డిప్యూటీ సీఈవో నాగేంద్రం, ఎన్నికల నోడల్ అధికారులు శ్రీనివాసరావు, రమేష్ బాబు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 11న ప్రభుత్వ సెలవు

● ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట, ఫిబ్రవరి9 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలో మున్సిపల్, ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని మక్తల్, కోస్గి మద్దూరు మున్సిపాలిటీల ఎన్నికలకు జరిగే ప్రాంతాలలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థలకు పోలింగ్ రోజు అయిన ఫిబ్రవరి 11న స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సిక్తా పట్నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నిర్వహణ దృష్ట్యా పోలింగ్ స్టేషన్లు ఉన్న అన్ని ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థల భవనాలు, పోలింగ్ నిర్వహణకు అవసరమైన ఇతర భవనాలలో పోలింగ్‌కు ముందు రోజు అయిన ఫిబ్రవరి 10న, అలాగే పోలింగ్ రోజు ఫిబ్రవరి 11న స్థానిక సెలవు దినంగా పాటించాలని ఆదేశించారు. అదేవిధంగా నారాయణపేట మున్సిపల్, మక్తల్, కోస్గి, మద్దూరు మునిసిపాలిటీల పరిధిలో ఎన్నికలకు నోటిఫై చేయబడిన ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో పనిచేసే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఫిబ్రవరి 11న స్థానిక సెలవు దినంగా ప్రకటించారు. ఇదే విధంగా నారాయణపేటజిల్లా పరిధిలో ఎన్నికలకు నోటిఫై చేయబడిన నారాయణపేట, మక్తల్, కోస్గి, మద్దూరు మునిసిపాలిటీ ప్రాంతాలలో నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం, 1881 ప్రకారం పోలింగ్ రోజు అయిన ఫిబ్రవరి11న సెలవు దినంగా ప్రకటించినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

## బ్యాంకు లావాదేవీలపై అవగాహన అవసరం

● ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకుని ఆర్థిక క్రమ శిక్షణ పాటించటం అలవరచుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత అవగాహనపై రూపొందించిన నాలుగు రకాల అవగాహన గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగ సేవల్లో ఇటీవలకాలంలో విస్తృతమైన మార్పులుచోటు చేసుకున్నాయని తెలిపారు. ఈ మార్పులకు అనుగుణంగా ఖాతాదారులు నగదు రహిత లావాదేవీలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటల్ లావాదేవీల వినియోగంపెరుగుతున్న నేపథ్యంలో ఖాతాదారులకు, ప్రజలకు ఆయా బ్యాంకర్లు తగిన అవగాహన కల్పించాలని సూచించారు. ఫిబ్రవరి 9 నుంచి ఫిబ్రవరి 13 వరకు నిర్వహించనున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా డిజిటల్ లావాదేవీల విధానాలు, సురక్షిత బ్యాంకింగ్ పద్ధతులు, బ్యాంకింగ్ సేవలప్రాముఖ్యతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా ఆర్థిక మోసాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాలో వచ్చే తెలియని లింకులు, సందేశాలను క్లిక్ చేసే ముందు జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు. బ్యాంకింగ్ సేవలపై సరైన అవగాహనతో పాటు జాగ్రత్తతో కూడిన ఆలోచన విధానం ఉంటేనే ఆర్థిక భద్రత సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి సురక్షిత బ్యాంకింగ్ విధానాలను అనుసరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్ వివిధ బ్యాంకుల కు చెందిన మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్‌లో పోలీస్ ఫ్లాగ్ మార్చ్

● ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

● మహబూబ్‌నగర్ ఎస్పీ డి. జానకి



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి9 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్, దేవరకద్ర భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం సాయంత్రం ఐదు గంటల తర్వాత ఎన్నికల ప్రచార సమయం ముగిసినందున అన్ని పార్టీల నాయకులు ఎన్నికల నియమాలు పాటించాలని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి సూచించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మహబూబ్‌నగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన పోలీస్ ఫ్లాగ్ మార్చ్‌లోజిల్లా ఎస్పీడి. జానకి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం 5.00 గంటలతో పూర్తిగా ముగిసిందని తెలిపారు. ఎన్నికల ప్రచార నిమిత్తంబయటి ప్రాంతాల నుండివచ్చిన రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రచార సిబ్బంది తదితరులు తప్పనిసరిగా సాయంత్రం 5.00గంటలలోపు తమ తమ ప్రాంతాలకు వెళ్లిపోవాలని స్పష్టం చేశారు. నిర్దేశిత సమయం అనంతరం జిల్లాలో.. రోడ్లపై ప్రచారం చేయడం, సభలు, ర్యాలీలు, నినాదాలు నిర్వహించడం.. వాహనాల ద్వారా ప్రచారం చేయడం.. గుంపులుగా సంచరించడంవంటి చర్యలు -మిగతా4లో..

## కల్వకుర్తి హస్తగతం కావాలి



◆ కల్వకుర్తి, ఆమనగల్లు గెలుపు సీఎంకు కానుకగా అందిస్తాం

◆ సంక్షేమ పథకాలే అభ్యర్థుల గెలుపుకు నాంది

◆ రాష్ట్ర మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు

◆ కల్వకుర్తిలో విజయవంతమైన కాంగ్రెస్ రోడ్‌షో

◆ ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**కల్వకుర్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** జరగనున్న ఎన్నికలలో కల్వకుర్తి మున్సిపల్‌ను హస్తం కైవసం చేసుకుంటుందని రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు ధీమా వ్యక్తం చేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని కల్వకుర్తి, ఆమనగల్లు మున్సిపాలిటిలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకొని సీఎం రేవంత్‌రెడ్డికి కానుకగా అందిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం సోమవారం చివరి రోజు కావడంతో ఎమ్మెల్యేకసిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి ఠాకూర్ బాలాజీసింగ్‌ల అధ్యక్షతన నిర్వహించిన రోడ్‌షో కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్ చారకొండ వెంకటేష్, ప్రజాగాయకుడు వేపూరి సోమన్నలు ముఖ్య అతిథులు హాజరై కల్వకుర్తి పట్టణంలో నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమపథకాలు మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి నాంది పలుకుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుతో అభివృద్ధికి బాటలు వేస్తూ కల్వకుర్తి మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇటీవల నిర్వహించిన పంచాయతీ ఎన్నికలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అమలుచేస్తున్న తీరుపై కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టారని మంత్రి గుర్తు చేశారు. -మిగతా4లో..

## ప్రజాదరణ కాంగ్రెస్ పార్టీకే

రెండేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు : మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఎన్నికల పరిశీలకులు మాజీ మంత్రి సాంబని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** దినం దినం కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజాదరణ లభిస్తుందని, కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీతోనే సర్వతో ముఖాభివృద్ధి సాధ్యమవుతుందని స్థానిక శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచార ఘట్టం ముగుస్తున్న సందర్భంగా సోమవారం రోజున వనపర్తి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ -మిగతా4లో..



సమావేశంలో మాట్లాడుతున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

## ఓట్ల లెక్కింపును పారదర్శకంగా నిర్వహించాలి

◆ ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలి ◆ మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి9 ప్రభాతవార్త:** ఫిబ్రవరి 13న నిర్వహించబోయే మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, నిస్పక్షపాతంగా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ, నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి స్పష్టం చేశారు. సోమ వారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కౌంటింగ్ సూపర్వై జర్లు, కౌంటింగ్ అసిస్టెంట్ల శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫిబ్రవరి 11న మహబూబ్ నగర్ కార్పొరేషన్, భూత్పూర్, దేవరకద్రమున్సిపాలిటీలలో ఎన్నికల ఓటింగ్ పూర్తయిన అనంతరం, ఫిబ్రవరి 13నజరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ అత్యంత కీలక దశ అని, అందుకు కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, ఓట్ల లెక్కింపు విధానాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండడాలని కలెక్టర్ సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లతో పాటు, రిటర్నింగ్ అధికారుల పాత్ర కూడా అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. నామినేషన్ దశ నుంచి ఫలితాల ప్రకటన వరకు మొత్తం ఎన్నికల ప్రక్రియకు రిటర్నింగ్ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఒకవేళ రీకౌంటింగ్‌కు సంబంధించి ఏవైనా అభ్యర్థనలు వస్తే వాటిని రాతపూర్వకంగా స్వీకరించాలని తెలిపారు. రీకౌంటింగ్‌ను ఆమోదించాలా, తిరస్కరించాలా అనే తుది నిర్ణయం రిటర్నింగ్ అధికారి విచక్షణ ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. లెక్కింపు కేంద్రాలలో రిటర్నింగ్ అధికారికి తప్ప ఇతరులకు మొబైల్ ఫోన్లు అనుమతించరాదని సూచించారు. కౌంటింగ్ ఏజెంట్లకు, అభ్యర్థులకు ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, శిస్పక్షపాతంగా చేస్తున్న విధాన్ని వారికి చూపించాలని అన్నారు. ప్రతి రౌండ్ లెక్కింపు పూర్తవగానే కౌంటింగ్ ఏజెంట్ల సంతకాలుతీసుకోవాలని సూచించారు. లెక్కింపు అనంతరం అభ్యర్థుల ఎన్నికల ఫలితాలను, జిల్లా ఎన్నికల అధికారుల అనుమతితోనే ప్రకటించాలని సూచించారు. ఒక వేళ పోటీలో ఉన్న అభ్యర్థులకు సమాన ఓట్లువస్తే వారికి డ్రాద్వారా ఫలితాలను నిర్ణయించాలని సూచించారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నిక పరిశీలకురాలు కాత్యాయని దేవి మాట్లాడుతూ ఒకవేళ రికౌంటింగ్ సంబంధించిన విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నియమావళిలో సూచించిన మార్గదర్శకాలను పాటించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఎటువంటి లోటుపాట్లకు తావు ఇవ్వకుండా నిస్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. లెక్కింపు సమయంలో చేయవలసిన పనులను మాక్ శిక్షణ ద్వారా కౌంటింగ్ సిబ్బందికి చూపించారు. లెక్కింపు సమయంలో మొదటగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించాలని అనంతరం బ్యాలెట్ బాక్సులలోని ఓట్లను లెక్కించాలని అన్నారు. బ్యాలెట్ పేపర్ అకౌంట్, పిఓ డైరీ, పేపర్ సీల్ అకౌంట్, విసిట్ షీట్‌ను ఓట్ల లెక్కింపు సమయంలో తప్పని సరిగా పరిశీలించాలని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్‌డిఓ నవీన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామిరెడ్డి, ఇంచార్జి జిల్లా పంచాయతీ అధికారి వెంకట్ రెడ్డి, డిఇఓ ప్రవీణ్ కుమార్, సియంఓ సుధాకర్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్లు బాలు యాదవ్, శ్రీకాంత్, నాగరాజ్, రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## చట్ట ప్రకారం భూసేకరణ

● పోలీస్ పహారా మధ్య గ్రామసభ

● రైతుల అభిప్రాయ సేకరణ కోసం గ్రామసభ నిర్వహణ : భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ అరుణారెడ్డి



బల్మూరులో పోలీస్ పహారా మధ్య కొనసాగుతున్న గ్రామసభ



మాట్లాడుతున్న భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ అరుణా రెడ్డి

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** భూ సేకరణ చట్టంలో సెక్షన్ 10ఎ ప్రకారం రైతుల అభిప్రాయ సేకరణ కోసం గ్రామసభ నిర్వహించడం జరిగి ందని భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ అరుణారెడ్డి అన్నారు. సోమవారం శ్రీఉమామహేశ్వర అచ్చంపేటలిఫ్ట్ ఇరిగేషన్ రిజర్వాయర్ నిర్మాణం కోసం భూసేకరణ చట్టం కార్యక్రమంలో భాగంగా బల్మూరులో భూ సేకరణపై రైతుల అభిప్రాయం కోసం నిర్వహించిన గ్రామ సభకు శ్రీఉమామహేశ్వర రిజర్వాయర్ భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ అరుణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సవరించిన చట్ట ప్రకారం రైతులఅభిప్రాయం కోసం గ్రామసభ నిర్వహించడం జరిగింది. కాల్వల నిర్మాణం కోసం 52 ఎకరాల 07గుంటలకు గాను 46రైతుల అభిప్రాయం కోసం గ్రామసభ నిర్వహించడం జరిగిందని ఆమె వివరించారు. 52 ఎకరాల 07 గుంటలకు గాను 46 మంది రైతులు, 16 వ సర్వే నెంబర్ లో భూసేకరణ చట్టం అమలులోకి వచ్చిందని, రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించాలని అధికారులు వివరించడంతో 46 మంది రైతులు 9 మంది రైతులు మాత్రమే తమ అభిప్రాయాలు గ్రామసభలో వెల్లడించారు. దీంతో కొంతసేపు అధికారులకు, రైతులకు రసాభాస కొనసాగింది. గ్రామసభ విజయవంతం అయినట్లు అధికారులు వెల్లడించగా, భూ సేకరణ పై తమ అభిప్రాయాలు ప్రభుత్వా నికి, అధికారులకు, శ్రీఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్మాణానికి నిర్వహించిన గ్రామసభ బహిష్కరిస్తున్నట్లు రైతులు కొంతసేపు నిరసన వ్యక్తం చేశారు. స్పందించిన భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ అరుణా రెడ్డి మాట్లాడుతూ రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామసభ నిర్వహించడం జరిగిందని, ఎక్కడ వ్యక్తిగత ద్వేషాలు లేవని ఆమెరైతులకు సూచించారు. ఈ గ్రామ సభకు భూసేకరణ డిప్యూటి కలెక్టర్ అరుణా రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్, ఉప తహసీల్దార్ కేశవ్, శ్రీ ఉమామహేశ్వర రిజర్వాయర్ డిటి సీతారాం, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శివ రామక్రిష్ణ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

**పోలీసు బందోబస్తు :** శ్రీ ఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్మాణం కోసం రైతుల అభిప్రాయం కోసం నిర్వహించిన భూసేకరణ అధికారులకు రక్షణగా అచ్చంపేట సీఐ నాగరాజు ఆధ్వర్యంలో భారీ పోలీసు -మిగతా4లో..

## మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌కు మాస్టర్ ప్లాన్

● మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్‌లను కలిపి ట్రైసిటీ

● రాష్ట్రంలో ఆర్‌ఆర్ టాక్స్ కట్టాల్సి వస్తుంది

● మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

● మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

● మున్సిపల్ కార్పొరేషన్ మేనిఫెస్టో విడుదల



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి9 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్‌లను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ఒక ప్రత్యేక ప్రణాళిక తయారు చేసి కేంద్రానికి నివేదించామని తెలిపారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌తో ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. డ్రైనేజీలుసిసి రోడ్లు తాగునీటి సదుపాయాలు 100% కల్పిస్తామని ఈ సందర్భంగా ఎంపీ హామీ ఇచ్చారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లోన్ అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. అప్పన్నపల్లి నుంచి చించోలి వరకు బైపాస్ డీపీఆర్ సిద్ధమైందని ఈ సందర్భంగా డీకే అరుణ మీడియాకు తెలిపారు.

**రాష్ట్రంలో ఆర్‌ఆర్ టాక్స్:** ఏదైనా పనులు చేసినా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలన్న తెలంగాణలో ఆర్‌ఆర్ టాక్స్ కట్టాల్సి వస్తుందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిందని స్వయంగా సీఎం చెప్తున్నారని, కాబట్టి పన్నులు పెంచే ఛాన్స్ ఉందని చెప్పారు. మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ మోసం చేసిందని, వృద్ధులకు రూ.4000 పెన్షన్, డిగ్రీ చదివే యువతులకు ఎలక్ట్రికల్ స్కూటీ, మహిళలకు నెలకు రూ. 2500 లాంటి ఎన్నో పథకాలను అమలు చేయకుండా మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని కోరారు. వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేస్తున్న మోడీకి అండగా నిలవాలని, మోడీ పాలన స్ఫూర్తితో మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌కు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యురాలు పద్మజా రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బి.సాహితీ రెడ్డి పాల్గొన్నారు.

## బిజెపి, బీఆర్‌ఎస్ పొత్తు లేదా..

◆ అబద్ధం అయితే ప్రమాణం చేయండి

◆ యెన్నం అన్నను నేను గుడికి తీసుకొస్తా

◆ మాజీ మంత్రి పాలన అసెంబ్లీ రౌడీ సినిమాను తలపించింది

◆ 59 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

◆ మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

◆ అన్ని వర్గాలకు సమచిత న్యాయం : డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ , జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** బిజెపి, బిఆర్‌ఎస్ మధ్య పొత్తు లేదు అని మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి గుడికి వచ్చి ప్రమాణం చేస్తారా అని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి ప్రశ్నించారు. మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ మొన్న మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బిజెపి పార్టీ నుంచి పోటీ చేయను అని యెన్నం గుడిలోకి వెళ్లి ప్రమాణం చేస్తారా అని మాటలకు అనిరుద్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. మహబూబ్‌నగర్ డిసిసి కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. గత పది ఏళ్ల మాజీ మంత్రి పాలనలో మహబూబ్‌నగర్ పట్టణంలో అసెంబ్లీ రౌడీ సినిమాను తలపించిందని, ఏషాపు ఓపెనింగ్ చేసిన శీనన్నఫోటో ఉండాలంటూ హుకుం జారీ చేశారని గుర్తు చేశారు. భూ కబ్జాలతో జనాలు భయాందోళన చెందారని, కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో వాటికి చరమ గీతం పాడినట్లు చెప్పారు. యెన్నం శ్రీనివాసరెడ్డి విద్యావేత్త విద్యా వైద్యంపై ఆయనకు ఉన్న విజన్ ఎవరికి లేదని పేర్కొన్నారు. గతంలో భార్యాభర్తలు మాట్లాడుకున్న ఫోన్ కూడా టాపింగ్ చేసి విన్న నీచ చరిత్ర బిఆర్‌ఎస్ నాయకులది అని విమర్శించారు. పవన్ కళ్యాణ్ ప్యాకేజిస్టార్ అని ఆయనకు ఇక్కడ ఏం పని అని ప్రశ్నించారు. జనసేన పార్టీ నుంచి నిలబడే వారికి సిగ్గు ఉండాలని దుయ్యబట్టారు. అంతకుముందు డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ టికెట్ల ఎంపికలో అన్ని వర్గాలకు సమన్యాయం చేశామని, కొన్ని వార్డుల్లో బీఆర్‌ఎస్‌కు అభ్యర్థులు కూడా లేరని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థులను మెజార్టీ స్థానాల్లో గెలిపించి మహబూబ్నగర్ కార్పొరేషన్ అభివృద్ధికి అందరూ సహకరించాలనికోరారు. మీడియా సమావేశంలో మహబూబ్‌నగర్ గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు మల్లు నరసింహారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాయి బాబా, నాయకులు సీజే బెనహర్, జడ్చర్ల పిఏసిఎస్ చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ నిర్వహణపై నిశిత పరిశీలన జరపాలి

**నారాయణపేట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో మైక్రో అబ్జర్వర్ల శిక్షణ తరగతుల్లో జనరల్ అబ్జర్వర్ సీతాలక్ష్మి సూచనలు ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికలలో కీలకమైన ఓటింగ్ ప్రక్రియ ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకురాలు సీతాలక్ష్మి మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు తు.చ. తప్పకుండా అమలయ్యేలా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించాలని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్లకు -మిగతా4లో..

### ఆరు గ్యారంటీలను అమలు

## చేయని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

**మీడియా సమావేశంలో బిఆర్ యస్ నాయకులు...**

**గద్వాల, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** గద్వాల మున్సిపల్ గద్దపై గులాబీ గెలుపు ఖాయం అని, ఆరు గ్యారంటీలను అమలు చేయనీ కాంగ్రెస్ కు ఈ ఎన్నికలలో ఓటర్లు బుద్ధి చెపుతారని స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్,మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి డా. ఆంజనేయ గౌడ్,నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జిబాసు హనుమంతు నాయుడు,మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్‌లు ధీమా వ్యక్తం చేశారు.సోమవారం గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ..గద్వాల మున్సిపల్ గద్దపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తూ బిఆర్ యస్ పార్టీ ఆశీర్వాదంతో గద్వాల నియోజకవర్గం ప్రజలు అందించిన విజయంతోనే ఎమ్మెల్యేగా కృష్ణమోహన్ రెడ్డి గెలిచారని గుర్తు చేశారు. కానీ,బీఫామ్ ఇచ్చి, ఎమ్మెల్యేగా గెలిపించిన బిఆర్ఎస్ పార్టీనీ నమ్మకద్రోహం చేసి, కాంగ్రెస్ పార్టీలో చేరడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. గత కేసీఆర్ ప్రభుత్వం గద్వాల జిల్లా తెచ్చి ఉపాధి అవకాశాలు పెంచామని,రైతు భరోసా, 24 గంటల మంచినీరు , పార్కుల సుందరీకరణ వంటి ఎన్నో అభివృద్ధి పనులు ఇచ్చారని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గద్వాల ప్రాంతానికి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. ప్రజలను మోసం చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి జరగాలంటే ఈ నెల 11న జరిగే పోలింగ్ లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పద్మ వెంకటేశ్వర రెడ్డి, కోటేష్,సూర్య గౌడ్, అంగడి బసవరాజ్,రాజారెడ్డి, వెంకటేష్ నాయుడు,చక్రిధర్ రెడ్డి,ఎస్.రాము నాయుడు, జాంపల్లి భరత్ సింహారెడ్డి,రాజు నాయుడు,లక్ష్మారెడ్డి,శ్రీకాంత్,రజిని బాబు, శ్రీనివాసులు, మహేందర్, వీరేష్, వివిధ వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

## అభివృద్ధి చేశా.. మూడోసారి ఆశీర్వదించండి

**15వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ బండారు సుజాత కృష్ణ**

**వనపర్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** రెండు పర్యాయాలు వరుసగా గెలిపించడంతో వార్డులో రోడ్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులతో పెద్దపీట వేశామని, మరోమారు కారు గుర్తుకు ఓటు వేయాలని 15వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, తాజా మాజీ కౌన్సిలర్ బండారు సుజాత కృష్ణ కోరారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు కృష్ణ మాట్లాడుతూ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో 15వ వార్డులో తాగునీటి ఎద్దడి నివారణకు ఇంటింటికి మిషన్ భగీరథ పైపులైను వేసి మంచినీటి సదుపాయం కల్పించామని, అర్హులైన ప్రతి ఒక్కరికి వృద్ధాప్య, ఒంటరి మహిళ ,వికలాంగుల పెన్షన్లు మంజూరు చేశామని, రోడ్డు విస్తరణలో భాగంగా ఇండ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్ రూమ్‌లు అందించామని ఈ సందర్భంగా తెలిపారు. వార్డు అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న బిఆర్ఎస్ పార్టీని మరోసారి ఆదరించి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వార్డులోని పెండింగ్‌లోఉన్న పలు అభివృద్ధి పనులను తాము గెలిచిన వెంటనే అభివృద్ధికి తోడ్పడుతామని ప్రజలకు హామీ ఇచ్చారు.



ప్రచారంలో పాల్గొన్న బండారు సుజాత కృష్ణ

## ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకెళ్లాలి

**తమిళనాడు ఏఐసిసి పరిశీలకులు డా. వంశీకృష్ణ**

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలని, తమ ప్రతిభను పరిరక్షించడానికి మాత్రమే కాబట్టి ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని తమిళనాడు ఎఐసిసి పరిశీలకులు, టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తమిళనాడు ఎఐసిసి పరిశీలకులు, టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కేవలం పరీక్షల సంవత్సరం మాత్రమే కాదు మీ ఉజ్వల భవిష్యత్తును దిశను మార్చే బలమైన పునాది అని, ప్రతి విద్యార్థి మూడు విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, క్రమబద్ధమైన చదువు ప్రతిరోజు కొద్దిగా సమయం కేటాయించి చదవాలని, టైం మేనేజ్మెంట్ , టైం టేబుల్ తయారు చేసుకుని క్రమం తప్పకుండా పాటించాలని సూచించారు. ప్రతి విద్యార్థి డివిజన్ అలవాటు చేసుకుని చదివిన విద్యను తిరిగి పునశ్చరణ చేసుకోవాలని, దీంతో విద్యార్థులు భయపడాల్సిన అవసరం లేదని, సరైన ప్రణాళికతో చదివితే 10వ తరగతి చాలా సులభంగా పూర్తి చేయడానికి వీలుంటుంది అన్నారు. మీ టీచర్లు, తల్లిదండ్రులు మీకు ఎంతో అండగా ఉంటారని, పరీక్షలు మీ ప్రతిభను పరిరక్షించడానికి మాత్రమే, మీ విలువలను కోల్పోవడానికి కాదని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని, ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ తో పాటు అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, పాఠశాలల మేనేజ్మెంట్, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలని అవగాహన కల్పిస్తున్న అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

## తాడురు పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** మండలంలోని తాడూరు గ్రామంలో ఉన్న యుపిఎస్ పాఠశాలను సోమవారం మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థుల పురోగతి, విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయుల ఉపస్థితి రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థులు హాజరు శాతం, ఉపాధ్యాయులు అందిస్తున్న బోధన పట్ల ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, విద్యార్థులను ఉన్నత చదువులకు అధిరోహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాల ప్రాంగణం, విద్యార్థుల మౌలిక వసతుల పట్ల ఆయన సమీక్షించారు. సమీక్షించిన వారిలో మండల విద్యాశాఖ అధికారితో పాటు ఆ పాఠశాల హెచ్ఎం రామస్వామి, లక్ష్మీనారాయణ, కమల తదితరులు ఉన్నారు.



తాడురు పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్

## అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి

**వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే**

**11వ వార్డు బీఆర్ఎస్ స్వాతి హరిబాబు**

**వనపర్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** వనపర్తి మునిసిపాలిటీ ఎన్నికల్లో 11వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థిగా తనను ఆదరించి కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని స్వాతి హరిబాబు ఓటర్లను అభ్యర్థించారు. 11వ వార్డు బీ ఆర్ ఎస్ అభ్యర్థి స్వాతి హరిబాబు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ11వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థిగా తనను కారు గుర్తుపై ఓట్లు వేసి గెలిపిస్తే సిసిరోడ్లు,డ్రైనేజీల నిర్మాణంతో పాటు వార్డును సర్వాంగ సుందరంగా ఉంచేందుకు కృషి చేస్తానన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామన్నా రు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తానని స్వాతి హరిబాబు పేర్కొన్నారు. అర్హులైన వారికి పింఛన్లు అందిస్తానన్నారు. మరో రెండేళ్ల తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సహకారంతో కాలనీలో ఏ సమస్య వచ్చినా ప్రజలకు అండగా ఉంటామన్నారు. వీధి దీపాలు పూర్తిస్థాయిలో నిర్మించి ఎలాంటి అవాంతరాలు రాకుండా చూస్తానన్నారు. వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న స్వాతి హరిబాబు

# శివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

**గద్వాల ఫిబ్రవరి9, ప్రభాతవార్త:**అలంపూర్ ఆలయాల్లో జరిగే మహా శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనేందుకు విచ్చేయు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అలంపూర్ శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి మహాశివరాత్రి మహోత్సవాలు ఈనెల 14 నుంచి 18 వరకు జరగనున్న నేపథ్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో అక్కడ చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు తాగునీటి కొరత లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పార్కింగ్ ఇబ్బందు లు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరాతో పాటు, లైటింగ్ ఏర్పాట్లు, హెల్త్ క్యాంపులు నిర్వహించాలన్నారు. తుంగభద్ర నది తీరాన గజ ఈతగాళ్లను నియమించి, అనుకోని పరిస్థితుల్లో భక్తులను రక్షించడానికి సిద్ధంగా ఉండేలా చూడాలన్నారు. పారిశుద్ధం విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు ఆలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా పర్యవేక్షణ చేయాలని సంబంధిత శాఖ అధికారులకు తెలిపారు. ఆర్టీసీ తరపున అదనపు బస్సులు నడిపేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. రథోత్సవం నిర్వహించే ప్రాంతంలో రహదారికి మరమ్మత్తులు చేపట్టాలని, అగ్నిమాపక శాఖ వాహనాన్ని అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులకు అవసరమైన సేవలు అందించేందుకు వాలంటీర్లు, ఇతర సేవా సంస్థల సభ్యుల సహకారం తీసుకోవాలన్నారు. వీఐపీలు, ఇతర ప్రజాప్రతినిధులు దర్శనార్థం వచ్చే అవకాశం ఉన్నందున ప్రోటోకాల్ ప్రకారం వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని అలంపూర్ ఆలయాల పరిసరాల్లో అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ శాఖ తరపున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తును నియమిస్తున్నట్లు చెప్పారు. మహిళా భక్తుల సౌకర్యార్థం అదనంగా మహిళా కానిస్టేబుల్స్‌ను నియమించనున్నట్లు పేర్కొన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు తమ పోలీస్ సిబ్బంది ఇతర శాఖల అధికారులతో కలిసి సమన్వయంతో పని చేస్తారని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ మొగిలయ్య, అలంపూర్ ఆలయాల కార్య నిర్వహణాధికారి దీప్తి, తహసిల్దార్ మంజుల, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస రావు

# మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారానికి తెర

**రానున్న మూడేళ్లలో మక్తల్ రూపురేఖలు మారుస్తా**

**నా జీవిత ఆశయం మక్తల్ అభివృద్ధే**

**క్రీడా పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** మక్తల్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి దంపతులు చివరి రోజు ప్రచారం ఉధృతంగా నిర్వహించారు. గతప్రభుత్వం గల్లీలో రోడ్లను, డ్రైనేజీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ప్రజా ప్రభుత్వం వచ్చాక వీటి నిర్మాణం చేపడుతున్నామన్నారు. వందల కోట్లతో మక్తల్ పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. రేషన్ షాపుల్లో ప్రతీ పేదవాడికి సన్న బియ్యం, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఫ్రీ బస్సు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఫ్రీ కరెంటు ఇలా అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు.నియోజకవర్గానికి 72 ఏండ్ల కాలంలో 14 మంది ఎమ్మెల్యేల ప్రాతినిధ్యంలో 242 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని స్థానికునిగా మక్తల్ నియోజకవర్గం వెనుకబాటుతనం అనుభవించిన తను ప్రాతినిధ్యంలో 25 నెలల కాలంలో వెయ్యి 32 కోట్లతో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి చూడని ఉన్నత వర్గం స్థానికేతరులు బీసీ నాయకునిగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న తన పై కక్ష కట్టి బిజెపి బీఆర్ఎస్ నాయకులు మున్సిపాలిటీలో కాంగ్రెస్ అడ్రస్ లేకుండా చేయడానికి రెండు పార్టీలు కంకణం కట్టాయని మక్తల్ అభివృద్ధిని కోరుకునే స్థానికులందరు ఈ విషయాన్ని గుర్తించాలని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఎన్నికల ప్రచారంలో ముగింపు భాగంలో భాగంగా సోమవారం 11 గంటలకు కన్యకా పరమేశ్వరి గుడి నుండి పురవీధుల గుండా వేలాదిమంది కాంగ్రెస్ ఆడ మగ యువత కార్యకర్తలతో పురవీధుల గుండా నినాదాలతో అంబేద్కర్ చౌరస్తా వరకు చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే మరిన్ని ఇండ్లు చేస్తామన్నారు. మక్తల్ ఆస్పత్రిలో 3 కోట్లతో మక్తల్ పట్టణంలో కొత్త డయాలసిస్ సెంటర్‌లో అదనపు సౌకర్యాలు.పడకల పెంపు జరగాలి. పట్టణంలో జాతీయ, రాష్ట్ర క్రీడలో పాల్గొన్న వారున్నారు. సత్తా పెంచేందుకు 25 కోట్ల తో మినీ స్టేడియం త్వరలో పనులు కావాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం అనుబంధ చైర్మన్ అయితే మక్తల్ ఇంకా బాగా అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు. 16 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిపించి మక్తల్ అభివృద్ధిలో పాటుపడాలని మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. ఈ భారీ ర్యాలీ కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ రాధా లక్ష్మారెడ్డి ,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, మాజీ మార్కెట్ చైర్మన్ రవి కమార్ యాదవ్ కాంగ్రెస్ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి

# పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం

**కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ రవి శేఖర్ రెడ్డి..**

**ఆత్మకూర్ ఫిబ్రవరి9, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ జాతీయ కోఆర్డినేటర్ రవిశేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.మున్సిపల్ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజు పట్టణంలోని పలు వార్డులలో కళ్ళు తిరుగుతూ ఆయన కాంగ్రెస్ పార్టీఅభ్యర్థులను గెలిపించాల్సిందిగా ఓటర్లనుఅభ్యర్థించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజలకు కూడు మరియు గూడు అందించడమే ప్రధాన ఎజెండాగా కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం పనిచేస్తుందని అందులో భాగంగానే మహిళలకు ఉచిత బస్సు,మహాలక్ష్మి పథకం కింద 500రూపాయలకే గ్యాస్ సిలిండర్, 4000 రూపాయల పెన్షన్ పథకాలను ప్రవేశపెట్టిందని ఆయన అన్నారు.గత పాలకులు నిర్లక్ష్యం మూలంగా తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కలు నిరంతరంగా కృషి చేస్తున్నారని ఆయన కొనియాడారు. దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం కడుక్కునే కార్యక్రమంలో భాగంగానే బిజెపి ఓటర్ల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తుందని దేశం ప్రజాస్వామిక మరియు విలువలు కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పని చేస్తున్న విషయాన్ని గుర్తించి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పట్టి ఎందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. మొత్తం నియోజకవర్గ శాసనసభ్యులు రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి ఉమ్మడి ఆత్మకూరు మండలాన్ని అభివృద్ధి పరిచేందుకు ఇప్పటికే వందలాది కోట్ల రూపాయలు వెచ్చించాలని అందులో భాగంగానే కృష్ణా నదిపై నూతన ప్రతినిర్మానం చేపట్టి ఆత్మకూర్ గద్వాల్ ప్రాంత ప్రజల చిరకాల కోరిక తీరుస్తున్నట్లుగా ఆయన తెలిపారు. అంతేకాకుండా ఆత్మకూరు పట్టణాన్ని రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేసేందుకు మంత్రివర్యులు ఇప్పటికే చర్యలు ప్రారంభించారని త్వరలోనే ఆత్మకూర్ ప్రజల కోరిక నెరవేర్చేందుకు ప్రకటన వస్తున్నట్లుగా ఆయన తెలిపారు రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా అమరచింత మరియు ఆత్మకూర్ మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రవికిరణ్, ఐఎన్టీయూసీ నాయకులు బోరింగ్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు తదితరులతో పాటుగా పలువు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్

# న్యాయస్థానాలను ఉల్లంఘిస్తున్న అధికారులు

**ప్రజా ప్రతినిధుల ఒత్తిడి మేరకు నిర్మాణం చేపట్టనున్న ప్రాజెక్టు**

**తమ ప్రాణాలు పోయినా సెంటు భూమి వదలం**

**బల్మూరు భూసేకరణ గ్రామసభలో రైతుల ఆవేదన**

**ఉప్పునుంతల,ఫిబ్రవరి 9ప్రభాతవార్త:**తాము నమ్ముకున్న నేల తల్లిని వదిలే ప్రసక్తే లేదని, అధికారులు, ప్రజా ప్రతినిధులు న్యాయస్థానాలను లెక్కచేయకుండా రక్షణ వలయం మధ్య తమను ఎంత ఒత్తిడి తీసుకొచ్చినా ప్రాణాలైనా వదులుకుంటాం కానీ...సెంటు భూమి వదిలి పెట్టే ప్రసక్తి లేదని రైతులు గ్రామసభలో ముక్తకంఠంతో రైతుల ముందు వాపోయారు. తాత ముత్తాతల నుంచి రక్షించుకుంటున్న తమ పొలాలను అర్థాంతరంగా ప్రజా ప్రతి నిధులా స్వలాభం కోసం తమను బలి చేయడం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బల్మూరు గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. శ్రీ ఉమామహేశ్వర రిజర్వాయర్ కింద నిర్మిస్తున్న ప్రాజెక్టు కోసం రైతుల అభిప్రాయం మేరకు నిర్వహించాల్సిన అధికారులు రైతులకు సమాచారం అందించకుండా గ్రామపంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించి గ్రామసభ విజయవంతం అయ్యేందుకు రైతులను గ్రామ సభకు వచ్చేలా కృషి చేయాలని ఒత్తిడి తేవడం సరికాదని రైతు రఘు మా రెడ్డి గ్రామసభలో అధికారుల పట్ల విరుచుకుపడ్డారు. తమకు న్యాయం జరిగేంత వరకు న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని, స్థానిక అధికారులు ప్రజాప్రతినిధులకు తలొగ్గి రైతులపై ఒత్తిడి మోపడం సరికాదన్నారు. తమ ప్రాణాలు పోయినా సరే తమ పొలాల మాత్రం వదిలే ప్రసక్తే లేదని, రాష్ట్రంలో ఒక న్యాయం, తమకు ఒక న్యాయమా అంటూ రైతు ఇంద్రసేనారెడ్డి రైతుల ముందు విరుచుకుపడ్డారు. గ్రామ సభకు రెండు రోజుల ముందుగా సమాచారం ఇవ్వకుండా, వారి ఇస్తాను సారంగా రైతులకు సమాచారం ఇచ్చాం, గ్రామ సభకు హాజరైన రైతుల అభిప్రాయాలు వెల్లడించాలని ఒత్తిడి తీసుకురావడం అధికారులకు సరికాదని, రైతుల అభిప్రాయ సేకరణ సేకరించాలి తప్ప ఒత్తిడి తీసుకురావడం సరైన న్యాయం కాదని ఉద్యోగాలు చేస్తున్నవారు శ్రీ ఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్మాణానికి శ్వాశీతులు కారనీ , రైతులపై కత్తులు మోపడం పూర్తిగా విడ్డూరంగా ఉందని విశ్రాంత ఉద్యోగి అనంతసుందర్‌రెడ్డి అధికారుల ముందు వారి బాధ వెలిబుచ్చారు.ఏది ఏమైనప్పటికీ మైలారం గట్టు సమీపంలో నిర్మిస్తున్న శ్రీ ఉమామహేశ్వర రిజర్వాయర్ ప్రాజెక్టుకు అనువైన ప్రాంతంలో నిర్మించకుండా రాజకీయాల ఒత్తిడి లకు అధికారులు నిర్మాణం చేపట్టాలని ఆలోచిస్తే అది అవివేకం అని, గ్రామసభను బహిష్కరిస్తున్నామని, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ శిరీష ఆధ్వర్యంలో తమ పొలాలను రిజర్వాయర్ కు అప్పగించే ప్రసక్తే లేదని, గ్రామసభ నుంచి తమ రైతులు బహిష్కరిస్తున్నట్లు ఆమె భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ అరుణా రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామ సర్పంచ్ శిరీషతోపాటు మాజీ శివ శంకర్, రఘు మా రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, అనంత సుందర్ రెడ్డి, నాగయ్య, నారాయణమ్మ , రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీ ఉమామహేశ్వర రిజర్వాయర్‌కు తమ పొలాలు ఇవ్వమని, గ్రామసభను బహిష్కరిస్తున్నట్లు సర్పంచు వినతిపత్రం అందజేత

# నాలుగు లేబర్ కోడ్ల రద్దుకై పోరాడుదాం

**భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కోళ్ల వెంకటన్న**

**చిన్నచింతకుంట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మిక వర్గానికి మరణ శాసనంగా మారిందని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కోళ్ల వెంకటన్న విమర్శించారు. సోమవారం మండల పరిధిలోని ఉంద్యాల గ్రామంలో తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక, కార్పొరేట్‌లకు అనుకూల విధానాలను ఉపసంహరించుకోనేలా కార్మిక వర్గం పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 12న దేశ వ్యాప్త సమ్మెలో అన్ని రంగాలలో పనిచేస్తున్న కార్మిక వర్గాలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి వెంకటేష్ గౌడ్, నాయకులు పరశురాం, బలరాం, కె.మాసన్న ,విన్ను ,లాజర్, ఏసన్న ,కృష్ణయ్య, దేవన్న, దండు శ్రీనుతో పాటు భవన నిర్మాణ, బీడీ ,ఆటో మోటార్ కార్మికులు పాల్గొన్నారు.



సమ్మె పోస్టర్‌ను విడుదల చేస్తున్న కార్మిక సంఘం నేతలు

## ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు : ఎస్ఐ

**గద్వాల ఫిబ్రవరి9,ప్రభాతవార్త:**గద్వాల మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం నేటి సాయంత్రం 5.00 గంటలకు ముగియనుందనీ, విషయాన్ని గమనించి మున్సిపాలిటీ 37 వార్డులలో పోటీలో ఉన్న కౌన్సిలర్ అభ్యర్థులు గాని, వీరి అనుచరులు గాని ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్సై కళ్యాణ్ కుమార్ హెచ్చరించారు.ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసు నమోదు చేస్తామని, ఇతర ప్రాంతాల వారు సొంత ఊర్లకు వెళ్లవలసిందిగా పోలీసుల విజ్ఞప్తి చేశారు. గద్వాల మున్సిపాలిటీలో ఎవ్వరు కూడా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించకూడదని ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

## ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు

**మద్దూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** మద్దూర్ మండలంలోని ఎరువుల దుకాణాలపై జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ (ఎఫ్‌సిఓ) నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని వ్యాపారులకు ఆదేశించారు.ఎరువుల విక్రయాలలో అక్రమాలు, అధిక ధరలు, నిల్వల దాచివేత, బిల్లుల లేకుండా విక్రయాలు, నాణ్యత లేని ఎరువుల విక్రయం జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి దుకాణంలో స్టాక్ ధరల బోర్డు ఏర్పాటు చేయాలని, రైతులకు బిల్ ఇవ్వాలని, ప్రభుత్వ ధరలకే ఎరువులు విక్రయించాలని సూచించారు.రైతులకు నాణ్యమైన ఎరువులు సమయానికి అందేలా వ్యవసాయ శాఖ తనిఖీలు కొనసాగిస్తుందని తెలిపారు. ఈ తనిఖీలలో ఉమ్మడి మద్దూరు కొత్తపల్లి మండల వ్యవసాయ అధికారులు ఎ.ప్రవీణ్ కుమార్, కె.రమేష్ పాల్గొన్నారు.

## శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన సన్నిధిలో మార్కెట్ డిఎం

**ఉప్పునుంతల,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులు మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి సోమవారం శ్రీ ఉమామహేశ్వర దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులు లక్ష్మీబాయికి అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్‌లు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ కమిటీ ముఖ్య కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేద పండితులచే ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయిని సన్మానించిన వారిలో అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన ఈవో శ్రీనివాసరావు, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నరసింహులు, వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి సరోజ, సూపర్వైజర్ జహంగీర్, మార్కెట్ డైరెక్టర్ రత్లావత్, శివ, శంకర్‌లు పాల్గొన్నారు.

## శివనామస్మరణతో మార్మోగిన బోడ జాంపే

**బాలానగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** బాలానగర్ మండలం బోడ జానంపేట గ్రామంలో గురు స్వామిలాలు ఆధ్వర్యంలో మహాపడిపూజ, ఇరుముడి కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగాయి. శివ నామస్మరణతో గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఓబిసి మండల అధ్యక్షులు పొట్లపల్లి యాదయ్య, శివ స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శివ స్వాములకు అన్న ప్రసాద పంపిణీ

**బిజినేపల్లి ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైల క్షేత్రానికి పాదయాత్రగా వెళ్తున్న శివ స్వాములకు, భక్తులకు సోమవారం మంగనూరు గ్రామ శివారులోని కేఎల్ఐ కాల్వ పక్కన ఆంజనేయ స్వామి ఆలయం వద్ద గ్రామానికి చెందిన షాగల అశోక్, చెన్నమ్మ దంపతులు, సంగనమోని రామాంజనేయులు యాదమ్మ దంపతులు శివ స్వాములకు అన్నప్రసాద పంపిణీ చేశారు. ఈ అన్నప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం వరకు కొనసాగిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత పుట్ట బాలరాజ్, పిట్టల భీమయ్య,యాదయ్య, పిట్టల నిరంజన్, మావిళ్ళ శివ, ఈ.శేఖర్, భీమయ్య సాంబ వివిధ ప్రాంతాల నుండి శ్రీశైలం చేరుతున్న స్వాములు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడి విద్యార్థులకు పలకలు పంపిణీ

**అడ్డాకుల, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** మండల పరిధిలోనికన్మనూర్ గ్రామంలోఅంగన్వాడీ కేంద్రం 1లో విద్యార్థులకు పలకలు, స్వీట్స్ పంపిణీ చేసిన పురోహితులు సురేష్ శాస్త్రి దంపతులు క్రితం మాసంలో బాసరలో శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో కన్మనూర్ పురోహితులు సురేష్ శాస్త్రి ధర్మపత్ని రాజేశ్వరి వారి కూతురు ధృతిక కి అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం నాడు పాపను గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం 1లో పాపతో


చిన్నారులకు పలకలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాటు దంపతులు ఇద్దరు వెళ్ళి విద్యార్థులకు పాప చేతి నుండి బాసరలో సరస్వతి పూజ చేసిన పలకలు,బలపాలు, స్వీట్స్, ఇప్పించి తమ కూతురితో పాటు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న విద్యార్థులకు శ్రీ సరస్వతి దేవి కరుణకటాక్షాలు కలిగి మంచి విద్యావంతులుగా ఎదగాలని అమ్మవారి ఆశీస్సులు అందరిపైనా ఉండాలని కోరుతూ చిన్నారులకు మొదటి విద్య ఈఅంగన్‌వాడీ కేంద్రాలు.కావున మొదటిఅక్షరం బాగుండాలనే కోరికతో విద్యార్థులకు అమ్మ వారి ప్రసాదం అందించడం జరిగినది.ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ1 టీచర్ వేంద్ర భారతి, ఆయ అనిత, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# క్రికెట్ పోటీలను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే

**బాలానగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** బాలానగర్ మండలంలోని పెద్దరేవల్లి గ్రామంలో సోమవారం జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని అన్నారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సహకరిస్తాయన్నారు.ఈకార్యక్రమంలో పట్లప్రభాకర్ రెడ్డి, పెద్ద రేవల్లి సర్పంచ్ శ్రీధర్ గౌడ్, చిన్న రేవల్లి సర్పంచ్ వెంకటరాములు గౌడ్, పెద్దాయ పల్లి లక్ష్మయ్య, జగన్ నాయక్, పరమే శ్వర్, శివానంద రెడ్డి,శశికాంత్ రెడ్డి, రమేష్, నాగరాజు, రవి, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రెస్‌క్లబ్ స్థల పంచాయితీ పరిష్కరించాలి

## తహసిల్దార్ రాజుకు వినతి పత్రం అందజేత

**శ్రీరంగాపూర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్‌కు కేటాయించిన స్థలానికి సంబంధించి నెలకొన్న పంచాయితీని వెంటనే పరిష్కరించాలని కోరుతూ జర్నలిస్టులు తహసిల్దార్ రాజుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బాలరాజు మాట్లాడుతూ గత 2023లో అప్పటి సర్పంచ్ వినీల రాణి


వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రెస్ క్లబ్ కు కేటాయించిన స్థల విషయంలో స్పష్టత లేకపోవడంతో జర్నలిస్టుల కార్యకలాపాలకు ఆటంకం కలుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని గుర్తించి వివాదాలను తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రెస్ క్లబ్ అనేది జర్నలిస్టుల వృత్తిపరమైన అవసరాలతో పాటు ప్రజా సమస్యలపై చర్చలకు కేంద్రంగా ఉంటుందని అలాంటి సంస్థకు స్థలం విషయంలో అనవసరమైన జాప్యం జరగడం సరికాదని వారు పేర్కొన్నారు. సంబంధిత రెవెన్యూ రికార్డులు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మండల విలేకరులు వేణుగోపాల్, వెంకటేష్ గౌడ్, కిట్టు స్వామి, శివసాగర్, నరేష్ గౌడ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మక్తల్ మున్సిపాలిటీని బిఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టండి

## మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల ప్రచారం నేడు చివరి రోజు పురస్కరించుకొని మక్తల్ మున్సిపాలిటీలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ శ్రేణులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్నర్ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రేవంత్ రెడ్డి హాయంలో రైతు బీమా,రైతు బంధు వంటి పథకాలన్నీ మాయమయ్యాయని, వికలాంగుల పెన్షన్ ఏమైందని ఆగ్రహం


ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం

వ్యక్తం చేశారు. హైడ్రాలో కూల్చి వేసిన ఇళ్ల నిరుపేదల ఇళ్ల ఈఎంఐ ఎవరు కట్టాలంటూ రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు.తన రాజకీయ గురువు చిట్టెం నర్సిరెడ్డిని మరిచిపోయిన వ్యక్తి శ్రీహరి అంటూ గుర్తు చేశారు. బారాస ఎన్నికల ఇంచార్జ్ దూదిమెట్ల బాలరాజు మాట్లాడుతూ ఒక ముఖ్యమంత్రి మాట్లాడే భాష ఏంటని అన్నారు. చరిత్రలో ఇప్పటివరకు కూడా ఏ ముఖ్యమంత్రి ఇలా మాట్లాడలేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా మక్తల్ ప్రజలు కేసీఆర్ ను గుర్తుపెట్టుకొని 14 వార్డులలో బిఆర్ఎస్ కు విజయాన్ని అందించి కెసిఆర్ కు రామ్మోహన్ రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర బిఆర్ఎస్ దేవర మల్లప్ప, మాజీ మార్కెట్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, మక్తల్ మాగనూర్ మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి ఎల్లారెడ్డి బిఆర్ఎస్ వివిధ గ్రామాల నుండి వచ్చిన సర్పంచులు, వార్డు ఇంచార్జ్ సుతారి రవి, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆత్మకూరులో మున్సిపల్ అభ్యర్థుల వినూత్న ప్రచారం

## మేనిఫెస్టోలో అమలు చేస్తామని ప్రమాణం

**ఆత్మకూర్ ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో తమను గెలిపిస్తే ఎన్నికల మేనిఫెస్టోలను అమలు చేస్తామంటూ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు వినూత్నంగా ప్రచారం చేపట్టారు. పట్టణంలోని రెండవ వార్డులో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎరుకలి రాములు తన ప్రచారాన్ని కొనసాగిస్తూ తనను ఓటర్లు గెలిపిస్తే రెండు సంవత్సరాల పాటుగా మున్సిపల్ కార్యాలయంలో ఎలాంటి ఇంటి పన్నులు వేయకుండా తానే కడతానని అంతేకాకుండా ఐదు సంవత్సరాల పాటుగా రెండవ వార్డులోని ప్రతి ఇంటి సెప్టిక్ ట్యాంకులను తన సొంత నిధులతోనే శుభ్రపరుస్తానని ప్రచారం చేయడంతో ఓటర్లు ముక్కున వేలేసుకుంటున్నారు. పట్టణంలోని పదవ వార్డులో పోటీ చేస్తున్న ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా తల్లి జుబేదాబేగం ప్రచారం నిర్వహిస్తూ మున్సిపల్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే పదో వార్డులో ప్రతి పేదింటి మహిళ వివాహానికి 25 వేల రూపాయలు పారితోషికంగా అందించినట్లుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. దానికి తోడుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి పలు పథకాలలో పదో వార్డుకు ప్రత్యేకించి ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందజేసే విధంగా చర్యలు తీసుకుంటానని పేద విద్యార్థులకు ఉన్నత విద్య చదివే విధంగా తోడ్పాటు అందిస్తానని ఎన్నికల్లో ప్రచారం నిర్వహిస్తూ దూసుకుపోతున్నారు. సాధారణంగా రాష్ట్రంలో కాని దేశంలో కాని జరిగే ఎన్నికలకు ప్రధాన పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలు ప్రకటిస్తున్న నేపథ్యంలో ఆత్మకూరులో కూడా మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న స్వతంత్ర మరియు కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు సొంతంగా ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించడమే కాకుండా ఐదు సంవత్సరాల పాటు మేనిఫెస్టోను అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటానని హామీలు కురిపిస్తుండడంతో పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

# కృష్ణ మండలంలో నూతన ప్రెస్ క్లబ్ ఏర్పాటు

**కృష్ణ, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** మండలంలోని క్షీరలింగేశ్వర స్వామీ మఠం ప్రాంగణంలో పాత్రికేయుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ప్రెస్ క్లబ్ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కృష్ణ మండల ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులుగా గురు ప్రసాద్, అధ్యక్షులుగా బి. దేవేంద్రప్ప, ప్రధాన కార్యదర్శి టి రమేష్, ఉపాధ్యక్షులు వి


అధ్యక్షులు దేవేంద్రప్పను సన్మానిస్తున్న దృశ్యం

సురేష్, సురేష్ సజ్జన్‌లు ఎన్నికయ్యారు. కోశాధికారిగా నాగేంద్ర, కార్యదర్శిగా చెన్నయ్య గౌడ్, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు దేవేంద్రప్ప మాట్లాడుతూ మండలంలో వివిధ పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టులను అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని, జర్నలిస్టుల సమస్యలపై ఐక్యమత్యంగా పోరాడతామని, ప్రెస్ క్లబ్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తమవంతు కృషి చేస్తామని అన్నారు. అలాగే తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎన్నికైన సభ్యులకు స్వీట్లు తినిపించి కమిటీ సభ్యులు స్థానికులు శుభాకాంక్షలు తెలిపారు.

# క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగండి

## -క్రీడాకారులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి...
## -వాలీబాల్ ఆడి సీఎం క్రీడలకు శ్రీకారం చుట్టిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులందరూ క్రీడల్లో మంచి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని,అప్పుడే క్రీడల్లో రాణించగలుగుతారని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నాగర్‌కర్నూల్ జిల్లా స్థాయి సీఎం క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ క్రీడా జెండాను ఆవిష్కరించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడి క్రీడలకు శ్రీకారం చుట్టారు. స్వయంగా మైదానంలోకి దిగి వాలీబాల్ ఆడటం ద్వారా క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపారు. కలెక్టర్ ఆటలో పాల్గొనడాన్ని చూసి క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో క్రీడల్లో మంచి ప్రతిభను ప్రదర్శించి, రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభతో రాణించి నాగర్‌కర్నూల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, ప్రతి క్రీడాకారుడు అంకిత భావంతో కృషి చేసి రాష్ట్ర స్థాయి సీఎం కప్ నాగర్‌కర్నూల్ జిల్లాకు వచ్చేలా లక్ష్యంగా పెట్టుకుని పోటీల్లో పాల్గొనాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సమానంగా ప్రావీణ్యం సాధించాలని సూచించారు. క్రీడలు శారీరక


క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

దారుఢ్యాన్ని పెంపొందించడమే కాకుండా మానసిక బలాన్ని, క్రమశిక్షణను అలవాటు చేస్తాయని అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ఇప్పటికే ఎంతోమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపుతూ జిల్లాకు మంచి పేరు తీసుకువస్తున్నారని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తూ గ్రామీణ స్థాయిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసే ప్రయత్నం చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. సీఎం కప్‌లో భాగంగా గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పోటీలను ఘనంగా నిర్వహించామని, ఆ దశల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో ఇప్పుడు జిల్లా స్థాయి పోటీలను నిర్వహించగలుగుతున్నామని తెలిపారు. తదుపరి దశలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.క్రీడలు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని అన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని, ప్రతి విద్యార్థి క్రీడల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.అనంతరం నాగర్‌కర్నూల్, అచ్చంపేట జట్ల మధ్య జరిగిన కబడ్డీ పోటీలను జిల్లా కలెక్టర్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటారు. అనంతరం వాలీబాల్ పోటీలను కూడా ప్రారంభించి, వాలీబాల్ క్రీడాకారులతో కలిసి జిల్లా కలెక్టర్ స్వయంగా మైదానంలోకి దిగి వాలీబాల్ ఆడారు.ఈ జిల్లా స్థాయి సీఎం క్రీడా పోటీల్లో వివిధ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి వెంకటేశ్వర్లు, జిల్లా క్రీడల శాఖ అధికారి సీతారాం నాయక్, డిప్యూటీ సీఈఓ గోపాల్ నాయక్, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ, ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు సామ రమేష్, సుభాషిని, నరేందర్, నిరంజన్ యాదవ్, వెంకటయ్య జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులు విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఎన్నికల ప్రచారం.. ప్రధాన పార్టీల భారీ ర్యాలీలు..

**కల్వకుర్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ఈనెల 11న నిర్వహించే మున్సిపల్ ఎన్నికలకు గత 6 రోజులుగా కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, స్వతంత్ర అభ్యర్థులు తమ ప్రచారాన్ని కొనసాగించి సోమవారం సాయంత్రం 5 గంటలకు ముగించారు. గత 6 రోజులుగా 3 ప్రధాన పార్టీలు గెలుపే లక్ష్యంగా పెట్టుకొని ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ఎన్నో విధాలుగా ప్రయత్నాలు చేశారు. ఎన్నికలలో గెలిచి చైర్మన్ పదవిని కైవసం చేసుకునేందుకు కల్వకుర్తి పట్టణంలో ఆయా పార్టీల రాష్ట్ర నాయకులను పిలిపించి ప్రచారాన్ని కొనసాగించారు. అధికార కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే కల్వకుర్తి పట్టణాన్ని మరింత అభివృద్ధి పరిచి ప్రజలకు అండగా నిలుస్తామని చెప్తూ ప్రజల ఓట్లు కూడగట్టుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు.


కాంగ్రెస్ పార్టీ రోడ్‌షోలో చైర్మన్ అభ్యర్థి, ఎమ్మెల్యే కసిరెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు

బిఆర్ఎస్ గత 10 ఏళ్లలో చేసిన అభివృద్ధి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది మేమే అని, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచి రైతులకు ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కరించిన ఘనత మాదేనని బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి పట్టం కడితే మరింత అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామని ప్రజల వద్దకు వెళ్లి ప్రచారాన్ని కొనసాగించారు. బిజెపి పార్టీ కాంగ్రెస్, బిఆర్ఎస్ దొందు దొందేనని ఇప్పటివరకు ఆ రెండు పార్టీలే కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ పదవిలో ఉండి పట్టణాన్ని అభివృద్ధి పరిచిన దాఖలాలు లేవని, బిజెపికి అవకాశమిస్తే కేంద్రం అందించే నిధులతో కల్వకుర్తి మున్సిపాలిటిని అభివృద్ధి పరిచి తీరుతామని ప్రజల వద్దకు వెళ్లి ప్రచారాన్ని కొనసాగించి ముగించారు. సోమవారం చివరి రోజు కావడంతో ఒకరికి దీటుగా మరొకరు అన్నట్లుగా కల్వకుర్తి పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా కార్యకర్తలు నాయకులు ఓటర్లతో కలిసి ర్యాలీలను నిర్వహించారు.

# ఎర్రగుట్ట చెక్‌పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

## ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**నారాయణ పేట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా కేంద్రంలోమున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎర్రగుట్ట చెక్‌పోస్ట్‌ను జిల్లా ఎస్పీ డా.వినీత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద జరుగుతున్న వాహనాల తనిఖీ విధానాన్ని స్వయంగా పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను పకడ్బందీగా తనిఖీ చేయాలని, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నగదు,మద్యం,ఇతర అనుమానాస్పద వస్తువుల తరలింపును కట్టడి చేయాలని ఆదేశించారు. ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, అవసరమైతే చెక్‌పోస్ట్ వద్ద


చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

సిబ్బంది సంఖ్యను పెంచి తనిఖీలను మరింత కఠినంగా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా కొన్ని వాహనాలను తనిఖీ చేసి, తనిఖీలు నిర్వహించే విధానంపై సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. సైలెన్స్ పీరియడ్‌లో ప్రచారం నిషేధం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం సైలెన్స్ పీరియడ్ కొనసాగుతున్నందున రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ తెలిపారు. ఈ సమయంలో బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారం వంటి ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులు, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కూడా ఎన్నికల ప్రచారం చేయరాదని తెలిపారు. సైలెన్స్ పీరియడ్‌లో మద్యం, నగదు లేదా ఇతర విలువైన వస్తువులను పంపిణీ చేయడం నిషేధమని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతలు పటిష్టంగా ఉండేలా, స్వేచ్ఛాయుతమైన, నిస్పక్షపాత ఎన్నికలు నిర్వహించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ డా. వినీత్ తెలిపారు. ఈ తనిఖీలో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ శివశంకర్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, రాజు, నరేష్, చెక్‌పోస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పిఎం శ్రీ పాఠశాలలో చెలిమి కార్యక్రమం

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల పియం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థుల సామాజిక, ఉల్లాసం, సామాజిక అభివృద్ధి కోసం ఉద్దేశించిన చెలిమి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువులో కాకుండా మానసిక ఒత్తిడిని అధిగమించి, భావోద్వేగాలను నియంత్రించు కోవడంలో చెలిమి కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉంటూ వారిలోని ప్రతిభను వెలికి తీయాలని కోరారు. అనంతరం కాంప్లెక్స్ హెచ్‌ఎం, జిల్లా గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం అధ్యక్షుడు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించడమే తమ లక్ష్యం అని ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో భావోద్వేగ స్థిరత్వం, ఆత్మవిశ్వాసం, మంచి ఆలోచనలు పెరుగుతుందని అన్నారు. అనంతరం నోడల్ టీచర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు చెలిమి గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు వివిధ రకాల నృత్యాలు, కథలు, ఆటల ద్వారా సామాజిక స్పృహ పై అవగాహన కల్పించారు. వారు ఎంతో ఉత్సాహంగా సృజనాత్మక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒత్తిడి మేనేజ్ మెంట్, స్నేహపూర్వక సంబంధాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రశేఖర్, పాఠశాల రాజస్వ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, నోడల్ టీచర్ చంద్రశేఖర్, నీల శ్రీధర్, మల్లారెడ్డి, ఉపాధ్యాయులు పోకల సతీష్, శ్యాంసుందర్ గౌడు, అజ్మతుల్లా, శ్రీనివాసులు, కల్పన, శ్యామల గౌరీ, శ్రీలత, జ్యోతి, వీరోజు రాజు, రాజా వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక స్థావరాలపై రెవెన్యూ అధికారుల దాడులు

## మూడు ట్రాక్టర్లు, రెండు ఇంజన్లు పట్టివేత


దుందుబి వాగులో ఇసుకను తోడుతున్న దృశ్యం

**రాజాపూర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** రాజాపూర్ మండల పరిధిలోని కుచర్కల్, చెన్నవెల్లి గ్రామ శివారులోని దుందుభి వాగులో అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడుతున్నారన్న సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సోమవారం దాడులు నిర్వహించి మూడు ట్రాక్టర్లు, రెండు ఇంజన్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్కు తరలించినట్లు తహసిల్దార్ రాధాకృష్ణ తెలిపారు. ఈ దాడుల్లో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్లు యాదయ్య, మంజుల, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, ముందు మరింత కఠినంగా వ్యవహరించి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయనున్నట్లు తహసిల్దార్ రాధాకృష్ణ తెలిపారు.

# ఉపాధి హామీ పనులు ప్రారంభించిన సర్పంచ్ గాయత్రి మల్లేష్ గౌడ్

**రాజాపూర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** రాజాపూర్ మండల పరిధిలోని రాయపల్లి గ్రామంలో సోమవారం గ్రామ సర్పంచ్ కిష్టారం గాయత్రి మల్లేష్ గౌడ్ గ్రామ శివారులో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ది పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ప్రవీణ్ కుమార్ గౌడ్, గ్రామ కార్యదర్శిరవికుమార్, కరోబార్ నరసింహులు తదితరులు ఉన్నారు.

# 16.44 లీటర్ల మద్యం స్వాధీనం.. కేసు నమోదు : ఎస్ఐ


మద్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు

**నారాయణపేట,ఫిబ్రవరి9 ప్రభాతవార్త:**నారాయణ పేట జిల్లా మున్సిపల్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పేట టౌన్ పరిధిలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పెరపల్లి గ్రామానికి చెందిన సాయికుమార్ గౌడ్ అనే వ్యక్తి వద్ద నారాయణపేట పట్టణంలోని శాసనపల్లి రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న 16.44 లీటర్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ఎస్ఐ తెలిపారు.ఎన్నికలసందర్భంగా అక్రమ మద్యం రవాణా,నిల్వలపై కఠినచర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజలను నట్టేట ముంచిన కాంగ్రెస్‌కు ఎన్నికల్లో బుద్ధి చెప్పండి

**దేవరకద్ర, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో ప్రజలను మభ్య పెట్టి, నట్టేట ముంచిందని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా దేవరకద్ర మున్సిపాలిటీలో భారీ ర్యాలీ నిర్వహించి, బహిరంగ సభలో మాట్లాడుతూ మనకు మంచి చేస్తున్న వారికి ఓటు వేయాలని సూచించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కల్యాణలక్ష్మి తులం బంగారం ఇయ్యలేదు అప్పుడు ఆశపెట్టిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఏం చేస్తలేదని మండిపడ్డారు. ఏదేమైనా రెండేళ్ల అయితే మళ్ళీ కేసీఆరే సీఎం అవుతారని తెలిపారు.రేవంత్ రెడ్డికి తిట్లు తప్ప వేరేది రాదని కేసీఆర్ ప్రజల మంచి కోసం ఆలోచిస్తే రేవంత్ రెడ్డికి బూతులే తెలుసన్నారు. రైతు బంధు డబ్బులు ఎలక్షన్ల తర్వాత ఇస్తా అని రేవంత్ రెడ్డి జూటా మాటలు చెప్తుండని దుయ్యబట్టారు. బీజేపీ వాళ్ళు అక్షింతలు తప్ప ఏమి చేయరని, కాంగ్రెస్ వాళ్లు ఓట్ల కోసం వస్తే కళ్యాణ లక్ష్మికి తులం బంగారం ఇస్తే ఓట్లు వేస్తామని చెప్పండని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ప్రశ్నిస్తే రేవంత్ కళ్ళు నెత్తికెక్కి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. బూతులు మాట్లాడడం తప్ప, రెండున్నరేండ్లలో ఒక్క రూపాయి పని కూడా చేయని రేవంత్ రెడ్డికి మున్సిపల్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఎదురు గాలి వీస్తున్నదని, దేవరకద్ర మునిసిపాలిటీలో 12 వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెట్టి నరసింహారెడ్డి, శ్రీకాంత్ యాదవ్, బిఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థి కాటం అనిత, సత్యం బాలరాజ్, కర్ణం రాజు, గాండ్ల శ్రీకాంత్, తుమ్మల శేఖర్ రెడ్డి, కేబిఆర్ గౌడ్, కురువ రవి, బిఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

# అపర సంజీవినిల 108, 102 అంబులెన్స్ సేవలు ప్రజలు వినియోగించుకోవాలి

**అడ్డాకుల, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108 మరియు 102 అంబులెనులు అత్యుత్తమంగా పనిచేస్తున్నాయని అపర సంజీవనిల ఆదుకుంటున్నాయని ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ కె. రవి అన్నారు. సోమవారం నాడు మండల కేంద్రంలోని 108/102 అంబులెన్సును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్ లోని వివిధ రకాల పరికరాల పనితీరు మరియు మందులను పరిశీలించడం జరిగింది 108 అంబులెన్స్‌ల ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలను అందిస్తున్నామని ప్రమాద బాధితులను ఆపదలో ఉన్న వారిని వెంటనే దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నామని 102 అమ్మ ఒడి అంబులెన్సులు గర్భిణీ స్త్రీలను పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి తిరిగి ఇంటికి చేర్చడం జరుగుతుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయిన తర్వాత తల్లి బిడ్డలను ఇంటిదగ్గర ఉచితంగా దించడం జరుగుతుంది.ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు వ్యాక్సినేషన్ కోసం అమ్మఒడి వాహనాలను ఉపయోగిస్తున్నారని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108, 102 అంబులెన్స్‌ల ద్వారా ప్రజలకు వైద్య సహాయాన్ని అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండల ప్రజలందరూ ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ మెహబూబ్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ జ్యోతి, పైలెట్ నయుం తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONBLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM-IV METROPALITAN MAGISTRATE M.M. DISRICT: AT:: MEDIPALLY
O.S. No. 734 OF 2023

Between:
**Galande Indu and others** ...Plaintiffs
And
**A. Sravan Kumar Reddy and another** ...Defendants

To
**K. Srinivas Reddy,** S/o. K. Krishna Reddy, Aged about 40 years, Occ: Business, R/o.H.No.228, Midjil Mandal, Mucharjapalli, Urkonda, Mahabubnagar District. ...Defendant No.2

Please take notice that, the above suit filed by the Plaintiffs against you and others seeking relief for perpetual injunction, restraining you and others from interfere into the suit schedule property i.e., Plot No.1, in Sy.No.4, admeasuring 200 Sq. Yards, or 167.2 Sq. Meters, situated at Chengicherla Village and G.P., Ghatkesar Mandal, erstwhile Ranga Reddy District, now it is Medchal-Malkajgiri District, which is bounded by North: Plot No.2, South: 25' Wide Road, East: Neighbours land, West: 25' Wide Road, and the same is posted to **23-03-2026** for appearance of Defendants No.2, i.e., as mentioned above person, and are directed to appear by personal or through their advocate/s on **23-03-2026 at 10.30 A.M.** in the above suit before the HONBLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE - CUM - IV METROPALITAN MAGISTRATE M.M. DISRICT: AT: MEDIPALLY, otherwise the matter will be decide on merits.

(By the Order of the Court)
**Sri K. Nagaprasad,**
**Advocates and associates**
O/o. Plot No. 7N/P, Road No.2, Sowbhagyapuram Colony, Kothapet, Hyderabad.

## మహబూబ్‌నగర్‌లో పోలీస్ ఫ్లాగ్ మార్చ్

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టినట్లయితే ఎన్నికల ప్రవర్తన నియమావళి మరియు సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రచారం ముగిసిన తర్వాత కూడా నిబంధనలు ఉల్లంఘించినట్లయితే సంబంధిత వ్యక్తులు చట్ట పరమైన శిక్షలకు లోనవ్వాల్సి ఉంటుందని జిల్లా ఎస్పీస్పష్టం చేశారు. శాంతి యుత, న్యాయసమ్మత ఎన్నికల నిర్వహణకు ప్రజలు, రాజకీయ పార్టీలు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరారు. అలాగే ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్‌ఎన్నికల రోజున జిల్లాపోలీసులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండి పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిఓటర్ భయరహితంగా,ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును విని యోగించుకునేలా చర్యలు తీసుకుంటామని,సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.ఈ ఫ్లాగ్ మార్చ్ గడియారం చౌరస్తా నుండి ఎస్‌బీఐరోడ్, వీరన్నపేట్, బండ్లగిరిరామ్‌మందిర్ చౌరస్తా, గ్రంథాల యం మీదుగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వరకు నిర్వహించబడింది. కార్యక్రమం లో డిఎస్పివెంకటేశ్వర్లు, వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ ఇన్స్పెక్టర్ హజాజుద్దీన్, వన్‌టౌన్ సబ్‌ఇన్స్పెక్టర్ సీనయ్యపోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చట్ట ప్రకారం భూసేకరణ

(మొదటి పేజీ తరువాయి)

బందోబస్తు నిర్వహించారు. సోమవారం బల్మూర్‌లో నిర్వహించిన గ్రామ సభకు శ్రీఉమామహేశ్వర రిజర్వాయర్ ప్రాజెక్టుకింద ఉన్న రైతుల అభిప్రా యాల కోసం భూసేకరణ అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో రైతుల నుంచిఅధికారులకు ఎలాంటి ఇబ్బందులుకలుగకుండా అచ్చం పేట సీఐ నాగరాజుఆధ్వర్యంలో ఉప్పునుంతల, బల్మూరు, లింగాల ఎస్సైలు వెంకట్‌రెడ్డి, రాజేందర్, వెంకటేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

## అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌ను ఆదరించండి

◆ 27వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి ఆవుల శ్రీలత రమేష్



ప్రచారం నిర్వహిస్తున్న 27వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి ఆవుల శ్రీలత రమేష్

**వనపర్తి రూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణాల అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేసిన బీఆర్ ఎస్ పార్టీకి చెందిన ఆవుల శ్రీలత రమేష్‌కు ప్రజలు అండగా నిలవాలని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు.వనపర్తి మునిసిపల్ ఎన్నికల ప్రచారంలో భాగం గా ఆదివారం రాత్రి ఇంటింటి ప్రచారంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా కేసీఆర్ పట్టణాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు చేసిన కృషిని ప్రజలు గుర్తు చేసుకోవాలన్నారు. ప్రతీ వార్డులో పార్కుల నిర్మాణం జరిగింది బీ ఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనేనన్నారు. పట్టణాల్లో వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించే లక్ష్యంతో హరితహారం పేరున మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వినియోగంపై నిషేధంతో స్వచ్ఛతకు బాటలు వేశారని గుర్తు చేశారు. అభ్యర్థి ఆవుల శ్రీలత రమేష్ మాట్లాడుతు ఈనెల 11న జరగనున్న మునిసిపల్ ఎన్నికల్లో తనకు అండగా నిలిచి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు.

## బీజేపీతోనే పట్టణాభివృద్ధికి బాటలు

◆ బీజేపీ అభ్యర్థి కొండోజు గోపీనాథ్ ◆ 13వ వార్డులో ఇంటింటి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ అభ్యర్థి కొండోజు గోపీనాథ్

**వనపర్తి రూరల్, ఫిబ్రవరి9 ప్రభాతవార్త:** పట్టణ పాలన బీజేపీ చేతిలో ఉంటేనే వార్డు సమగ్ర అభివృద్ధి పరుగులు పెడుతుందని, ఇలా వచ్చి అలా వెళ్లే వలసదారుల చేతిలో వార్డును పెట్టవద్దని 13వ వార్డు బీజేపీ అభ్యర్థి కొండోజు గోపీనాథ్ అన్నారు. సోమవారం గోపీనాథ్ ఇంటింటి ప్రచారం నిర్వ హించగా వార్డులోని ప్రజలు ఆయన ప్రచారానికి అపూర్వ ఆదరణ లభించ డంతో పాటు వార్డు ప్రజలు ఆయనకు తిలకం దిద్దుతూ హారతులతో స్వాగ తం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది తమ పబ్బం గడపకోవడానికి వివిధ వార్డులలో గుడారాలు వేస్తుంటారని ఆ గుడా రాలను నమ్మి మన ఓటు గనక వారికి వేస్తే గెలిచాక వాళ్లు ఏ పార్టీ నుంచి ఏ పార్టీకి వెళ్తారో వారికే తెలియదని విమర్శించారు. 13వ వార్డు అభివృద్ధిని నా బుజస్కందాలపై వేసుకొని అభివృద్ధి పరచుకుంటానని అన్నారు. ప్రచార నిమిత్తం వార్డులోకి వెళ్ళగా ప్రజలంతా తమ సొంత ఇంటి బిడ్డలా ఆదరి స్తూ సాధనంగా ఆహ్వానం పలుకుతూ ఆదరించడం తనకెంతో సంతోషాన్ని చ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి బిజెపిని గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధికై మరోసారి ఆశీర్వదించండి

◆ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం

◆ 4వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పుట్టోజు శారద బ్రహ్మాచారి

**వనపర్తి, ఫిబ్రవరి9 ప్రభాతవార్త:** ప్రతి వర్గానికి, ప్రతి కుటుంబానికి భరోసా ఇవ్వడమే నా సంకల్పం అని పుట్టోజు శారద బ్రహ్మాచారి 14వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పేర్కొన్నారు. సోమవారం 14 వ వార్డులోని జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, పిల్లల సంక్షేమం కోసం అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం మహిళా సంఘం సభ్యులకు మహిళా సమైక్య భవన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మహిళలకు కుటీర పరిశ్ర మలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.పెళ్ళి అయిన ప్రతి అర్హురాలైన అమ్మాయికి షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలు అమలు చేయిస్తామని హామీ ఇచ్చారు. టిఎంఆర్ అభయ హస్తం పథకం నిరంతరం కొనసాగిస్తామని అలాగే వార్డుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామ న్నారు. వార్డులోని సిసి రోడ్ల మరమ్మత్తులు పలు అభివృద్ధి పనులకు పాటు పడతామని వార్డు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలంది స్తామన్నారు.ఇళ్ళులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయించి. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రతి అవసరంలో ప్రజలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. బ్రహ్మంగారి ఆలయ పార్క్ అభివృద్ధికి పాటుపడుతూ ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాల ఏర్పాటు చేయించి శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని. ఈ సందర్భంగా తెలిపారు.



ప్రచారంలో పాల్గొన్న 14వ వార్డు అభ్యర్థి పుట్టోజు శారద బ్రహ్మాచారి

# బీఆర్ఎస్‌ది దోపిడీ పాలన

- సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్‌ది సంక్షేమ పాలన - భూత్పూర్ మున్సిపల్ ఎన్నికల రోడ్‌షోలో ఎమ్మెల్యే జీఎంఆర్



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి

**భూత్పూర్,ఫిబ్రవరి 9,ప్రభాతవార్త:** పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని,ప్రాజెక్టుల పేరిట ఏడు లక్షల కోట్ల అప్పులు మిగిల్చి సుభిక్షంగా తెలంగాణ రాష్ట్రాన్ని దివాళా తీయించారని,ఇక్కడ ఎమ్మెల్యేగా రెండు దఫాలుగా పనిచేసిన ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మట్టిని సైతం వదలకుండా ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్లు దోపిడీ చేసి గడించి హైదరాబాద్ జూబ్లీహిల్స్ అద్దాల భవంతిని నిర్మిం చుకున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధు సూధన్‌రెడ్డి(జీఎంఆర్) విమర్శించారు.పాలమూరు ముద్దుబిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ చేసిన అప్పులకు నెలనెలా వడ్డీ చెల్లిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్రంలో నిజమైన ప్రజా సంక్షేమ పాలన సాగిస్తున్నారని,ప్రజల కోసం ప్రజాపాలన చేస్తున్న కాంగ్రెస్‌కు ఓటేసి అధికారం కట్టబెట్టాలని,ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం రాబోయే అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికలకు పునాదులుగా నిలుస్తాయని అన్నారు.మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో చివరి రోజు సోమవారం మధ్యాహ్నం మున్సిపాలిటీ పరిధిలోని ఒకటోవార్డు సిద్దయ్యపల్లి, 5,6, 7,8వార్డులు అమిస్తాపూర్ నుంచి పార్టీ చైర్మన్ అభ్యర్థి బాలకోటి నేతృత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలు,నాయకులు,పార్టీ అభ్యర్థులు ప్రజలు, అభిమానులు నిర్వహించిన భారీ బైక్‌ర్యాలీ,రోడ్‌షోలో పాల్గొన్నారు. బైక్‌ర్యాలీలో ఎమ్మెల్యే జీఎంఆర్‌పార్టీ చైర్మన్ అభ్యర్థి ముడావత్ బాల కోటి(బాలు)ని బైక్‌పై కూర్చోబెట్టుకుని ఎమ్మెల్యే జీఎంఆర్ బైక్‌ను నడిపి కాంగ్రెస్ కార్యకర్తలు,నాయకులు,అభ్యర్థులకు ఉత్తేజాన్ని కల్గించారు.ర్యాలీ మూడు కిలోమీటర్ల అనంతరం భూత్పూర్ పట్టణ చౌరస్తాకు చేరుకుంది. భూత్పూర్ చౌరస్తాలో జనసంద్రంగా మారిన కాంగ్రెస్ అభిమానులు ,అభ్యర్థులు,కార్యకర్తలు,నాయకులనుద్దేశించి ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రసం గించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ దోపిడీ పాలనను రాష్ట్ర ప్రజలు అంతమొందించారని,రాష్ట్రాన్ని నిలువునా ముంచిన బీఆర్ఎస్ మళ్లీ మున్సిపల్ ఎన్నికల్లో ఓట్లడిగేందుకు ముందుకు వస్తోందని,దోపిడీ పాలనకు ఆజ్యం పోసిన బీఆర్ఎస్‌ను ఈ మున్సిపల్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెసన అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,మాజీ ఎంపిపి కదిరె శేఖర్‌రెడ్డి,మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి పార్టీ అభ్యర్థులు ముడావత్ మాధురి(1వ వార్డు),నిమ్మల అన్నపూర్ణ(2వ వార్డు),పాత్లావత్ లాల్య(3వ వార్డు),గడ్డంసాయిప్రసాద్(4వవార్డు),కెంద్యాల పద్మ(5వ వార్డు),కెంద్యాల మశ్చందర్(6వవార్డు),శ్రీదేవి(7వవార్డు),ముడావత్‌బాలకోటి(8వ వార్డు, చైర్మన్ అభ్యర్థి),చంద్రకళ(9వ వార్డు),లిక్కి సూర్యకళ(10వ వార్డు)లతో పాటు కాంగ్రెస్ సర్పంచులు మలిశెట్టి వెంకటేష్(కొత్తమొల్గర), మాసగౌడ (కప్పెట),ఆనంద్‌రెడ్డి(పోతులమడుగు),సంజీవరెడ్డి(హస్నాపూర్),తారు నాయక్(భట్టుపల్లి తండా-ఏవీఆర్‌కాలనీ)లతో పాటు పార్టీ నాయకులు బోరింగ్ నర్సింహులు,లిక్కి విజయ్‌గౌడ్,గడ్డం యాదయ్య,గడ్డం ఎల్లప్ప, పల్లెరాంరెడ్డి,శ్రీనివాసులు,కెంద్యాల రాజేష్,కెంద్యాల నరేందర్,కోరె పవన్,కొండన్న,రవీందర్‌రెడ్డి,ఎర్రవాపు నర్సింహులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయం

■ దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల దేవరకద్ర మున్సిపాలిటీ మహిళలు, నాయకులు, ప్రజలు, సంతోషంగా ఉన్నారని, అందుకే మరోసారి ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం దేవరకద్ర మున్సిపాలిటీలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ ఎన్నికల ప్రచారంలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మీడియాతో దేవరకద్ర ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినరెండు సంవత్సరాలలో దేవరకద్ర మున్సిపాలిటీలో 100 పడకల ఆసుపత్రి, డిగ్రీ కాలేజ్ ఏర్పాటు, ఐదు కోట్లతో మున్సిపాలిటీ భవనానికు భూమి పూజ చేశామని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వేయడం జరిగిందన్నారు. బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్ పార్టీని ఓడించాలని కుట్రలు చేస్తున్నారని,ఎవరు ఎన్ని కుట్రలు చేసినా దేవరకద్ర నియోజకవర్గంలోని భూత్పూర్, కొత్తకోట, దేవరకద్ర, మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా దేవరకద్రలో అండర్‌పాస్ విషయంలో బిజెపి చేస్తున్న తప్పుడు ప్రచారా న్ని ఖండించారు. కాంగ్రెస్ పార్టీ కృషి వల్లనే అండర్పాస్ బ్రిడ్జి మంజూరు అయిందని,వచ్చే నెలలో పనులు ప్రారంభిస్తామన్నారు. బిజెపి, బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే వృధా అని అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. దేవరకద్ర మున్సి పాలిటీ అభివృద్ధి చెందాలంటేఅధికార కాంగ్రెస్ పార్టీతో సాధ్యమని అధికార పార్టీకి ఓటు వేసి అభివృద్ధికి బాటలు వేద్దాం అన్నారు. దేవరకద్ర మున్సిపాలిటీ సమగ్ర అభివృదే తమ లక్ష్యం అన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో దేవరకద్ర మున్సిపాలిటీని ఎంతో అభివృద్ధి చేశామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, కురుమూర్తి దేవస్థాన చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, కొండ గోవర్ధన్ రెడ్డి, అంజన్ కుమార్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, ఫారుఖ్ అలీ, కౌకుంట్ల సర్పంచ్ నరేష్ కుమార్, ముచ్చింతల సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, గోపన్‌పల్లి సర్పంచ్ బాల్‌రాజ్, గోపన్‌పల్లి శ్రీకాంత్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, పకీరన్న, రాంబాబు, గుడిబండ అమరేశ్వర్ రెడ్డి, ఉమ్మిగారి వెంకటేష్, వర్మ, బలుసుపల్లి శంకర్, ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

## రేపటి కోసం ఫైనాన్షియల్ ఫ్లానింగ్ అవసరం

■ రిసోర్స్ పర్సన్ వీర బ్రహ్మ రావు అరికెపుడి

**బిజినేపల్లి, ఫిబ్రవరి9 ప్రభాతవార్త:** తల్లిదండ్రులు విద్యార్థులకు చిన్న తనం నుంచే డబ్బు విలువను, పొదుపు ప్రాముఖ్యతను నేర్పాలని రిసోర్స్ పర్సన్ వీర బ్రహ్మ రావు అరికెపుడి సూచించారు. పాలెంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సోమవారం ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్‌అంశంపై జాతీయస్థాయివర్క్‌షాప్ నిర్వహిం చారు. వీర బ్రహ్మరావు మాట్లాడుతూ భారతదేశంలో ఆర్థిక అక్షరాస్యత పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం నియంత్రణ సంస్థల ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. సోషల్ మీడియాలో వ్యాపిస్తు న్న తప్పుడు ఆర్థిక సలహాలు, క్రిప్టో కరెన్సీ పెట్టుబడుల వల్ల వచ్చే ప్రమాదాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కళాశాల ప్రిన్సిపల్, వర్క్‌షాప్ చైర్మన్ డా.పి.రాములు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు డబ్బును సక్రమంగా నిర్వహించడం నేర్చుకో వాలని, భవిష్యత్తులో క్రమశిక్షణ గల ఆర్థికవేత్తలుగా ఎదగాలని సూచిం చారు. చిన్నప్పటి నుంచే తల్లిదండ్రుల కష్టాలను గుర్తిస్తూ ఆర్థిక విషయా లపై అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్ర మంలో వైస్ ప్రిన్సిపల్ డా.సుష్మ, లైబ్రేరియన్‌డా. వర్కాల శ్రీనివాసులు, అధ్యాపకులు డా. నాగరాజు, శివ, డా. రాధాకుమారి, స్వప్న, వెంకటేష్, రమేష్, ప్రవళిత, మనోజ్ కుమార్, యాదగిరి, ప్రకాష్, రాములు తదితరులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ధృవపత్రాలు పొందిన విద్యార్థులు

## పేటలో బీఆర్ఎస్ ప్రచార హవా



ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి

**నారాయణ పేట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణంలో మున్సిపల్ ఎన్నికల చివరి రోజున బీఆర్ఎస్ పార్టీ ప్రచారం జోరందుకుంది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి షాప్ టు షాప్ ప్రచారంనిర్వహించారు ఈ సందర్భంగా ఆయన ప్రజలతో స్నేహ పూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దుకాణ యజమానులను పలకరిస్తూ బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ప్రచారం అంతటాఉత్సాహం, ఆత్మీయత స్పష్టంగా కనిపించింది స్థానికులు బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని గుర్తు చేస్తూ తమ మద్దతును వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని నాయకులు వివరించారు. కాంగ్రెస్‌నాయకులు చైర్మన్‌సీటును ఐదు కోట్లకు అమ్ముకున్నారనే ఆరోపణలు ప్రజల్లో చర్చనీ యాంశంగా మారా యని వారు పేర్కొన్నారు. అలాంటి వారు పట్టణ అభి వృద్ధి చేయడం సాధ్యం కాదని విమర్శించారు. పేట అభివృద్ధి కావాలంటే బీఆర్ఎస్ పార్టీకే ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచారం లో రాష్ట్రపార్టీ ఇంచార్జిగా విచ్చేసిన సీనియర్ నాయకులు, జనగామ నియో జకవర్గ మాజీ ఎమ్మెల్యేముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పాల్గొన్నారు. అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. కౌన్సిలర్ అభ్యర్థి చెన్నారెడ్డి, సీనియర్‌నాయకులు విజయసాగర్, సుదర్శన్ రెడ్డి ప్రజలు,పార్టీ కార్యకర్తలు ఉన్నారు. ప్రజల నుంచి లభించిన స్పందన బీఆర్ఎస్ విజయానికి సంకేతంగా కనిపిస్తోందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**అడ్డాకుల, ఫిబ్రవరి9 ప్రభాతవార్త:** మండల పరిధిలోని శాఖపూర్ గ్రామానికి చెందిన వాసుదేవ్‌గౌడ్ కుమార్తె జయమ్మ ఆర్థిక కష్టాలలో ఉండటం వలన 2005 పదవ తరగతి చిన్ననాటి స్నేహితులు దృఢ సంకల్పంతో తమ వంతు సహకారం అందరూ కలిసి రూ.65,000 వేలు స్నేహితుని కుటుం బానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు భాస్కర్ గౌడ్, భీమార్జున్, ప్రవీణ్ గౌడ్ , మహేష్, కృష్ణవేణి, బిందు, రాధా పాల్గొన్నారు.

## జాతరలో అన్నదానం

- కొనసాగుతున్న మునిరంగస్వామి జాతర



**భూత్పూర్,ఫిబ్రవరి 9,ప్రభాతవార్త :** భూత్పూర్ పట్టణంలో వెలసిన శ్రీశ్రీశ్రీ మునిరంగస్వామి జాతర మహోత్సవాలు ఘనంగా కొనసా గుతున్నాయి.మహిమాన్వితమునిరంగస్వామి వార్షిక బ్రహ్మో త్సవాలు గత శుక్రవారం నుంచి ఆరంభమయ్యాయి.వారం రోజుల పాటు కొనసాగే మునిరంగస్వామి జాతరమరోమూడ్రోజులు కొనసా గనుంది.ఆనవాయితీ ఏటా జాతరలో భక్తుల సౌకర్యార్థం బీఆర్ఎస్ సీనియర్ నేత టి మురళిధర్‌గౌడ్-భవానీ దంపతులు ఈ ఏడాది మునిరంగస్వామి జాతరలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. అన్నదానంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ భూత్పూర్ మండల అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్ గౌడ్,సత్తూర్ నారాయణగౌడ్,గడ్డం రాములు,వడ్ల బ్రహ్మయ్య, గొడుగు వెంకటరాజు,ఎండి సాధిక్,ఎండి ఆహ్మద్,ఎండి యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

## కురుమయ్య కుటుంబానికి జెకె ట్రస్ట్ ఆర్థిక సాయం

**నవాబుపేట, ఫిబ్రవరి 9,ప్రభాతవార్త :** నవాబుపేట గ్రామవాసి ఇటీవల మరణించిన చిన్న కురుమయ్య కుటుంబానికి వారి దశదినకర్మ కార్యానికి, జెకె ట్రస్ట్ 10 వేల రూపాయలు నగదు 25 కేజీల బియ్యము కురుమయ్య కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది. కుటుంబ సభ్యులు జెకె టెస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెకె ట్రస్ట్ డైరెక్టర్ నరసింహ చారి పుట్టి ఆంజనేయులు ట్రస్ట్ సభ్యులతోపాటు గ్రామస్తులు ఉన్నారు.



## హామీల ముసుగులో కాంగ్రెస్ పాలన

● మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ

**దేవరకద్ర,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం హామీల ముసుగు లో ప్రజలను మోసం చేస్తోందని, ఖజానా ఖాళీ పేరుతో పన్నుల భారా న్ని సామాన్యులపై మోపేందుకు సిద్ధమైందని ఎంపీ డీకే అరుణ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. దేవరకద్ర మున్సిపాలిలోని భారీ ర్యాలీ నిర్వ హించి, గడపగడపకు విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తూ, విలేకరుల సమావేశంలోఎంపీ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనఅంటే మాటల హడా వుడి తప్ప అభివృద్ధి లేదని విమర్శించారు. మహిళలకు భద్రత లేకుండా పోయిందని, రాష్ట్రంలో ఆడపిల్లలపై అత్యాచారాలు పెరిగినా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 18 ఏళ్ల నిండిన మహిళలకు నెలకురూ.2500 ఇస్తామని చెప్పి మాట తప్పిందని, డిగ్రీ చదువుతున్న యువతులకు ఎలక్ట్రిక్ స్కూటీలు అన్న హామీ గాలిలో కలిసిపోయిందని దుయ్యబట్టారు.వృద్ధులకుపెన్షన్లు రూ.4 వేలకు పెంచు తామన్న కాంగ్రెస్ హామీ అమలు కాకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. మరోవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాలమూరు జిల్లాకు వేల కోట్ల రూపాయల నిధులు అందించిందని తెలిపారు. అమృత్ పథకం,ఆర్థిక సంఘాల నిధులు,ఆర్‌ఓబిలు, బైపాస్ రోడ్లు, విద్యాసంస్థల భవనాలకు కేంద్రం నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. దేవరకద్ర మున్సిపాలిటీల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం.కాంగ్రెస్ అంటే పన్ను లు, అవినీతి, అసురక్ష అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు,బిఆర్ఎస్ కు గుణపాఠం చెప్పాలంటే దేవరకద్ర మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని ఏకపక్షంగా గెలిపించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో దేవరకద్ర నియోజకవర్గ ఇంచార్జ్ కొండా ప్రశాంత్ రెడ్డి, మహ బూబ్‌నగర్ కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డి, కృష్ణంరాజు, భారతీ య జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాదరణ కాంగ్రెస్ పార్టీకే

(మొదటి పేజీ తరువాయి)

తరఫున 33 వార్డుల నుంచి భారీ ర్యాలీని నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, ఎన్నికల పరిశీల కులు మాజీ మంత్రి సాంబని చంద్రశేఖర్,రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, డిసిసి అధ్యక్షులు శివసేనరెడ్డి,రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టి నిరుపేదలకు అండగా నిలుస్తుందన్నారు.రూ. 5 లక్షల విలువగల ఇందిరమ్మఇండ్ల మంజూరి,ఉచిత కరెంటు,మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం,మహిళలకు వడ్డీ లేని రుణాలు,మహిళా సంఘాల భాగస్వామ్యంతో ఆర్టీసీ బస్సులు కొనుగోలు లాంటి మరెన్నో పథకాలు లబ్ధిదారుల చెంతకు చేరుతున్నాయన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో దాదాపు ఒక్కో రైతుకు లక్ష రూపాయల విలువ గల రాయితీలను ఎత్తేసి కేవలం రైతుబంధుమాత్రమే ఇచ్చారని వారూ విమర్శించారు.నేడు గ్రామ గ్రామాన ఇందిరమ్మ ఇండ్ల పండుగ నడుస్తుందని గత పదేళ్ల కాలంలో ఏ ఒక్క గ్రామంలో ఒక్క ఇల్లు ఇచ్చిన పాపనా పోలేదని వారన్నారు.ప్రతి వ్యక్తి చిరునామాకు అవసరమయ్యే రేషన్ కార్డులను సైతం ఏ ఒక్కరికి ఇవ్వలేదని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కవ్యక్తికి రేషన్‌కార్డు మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో 33 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు యువకులు, మహిళలు పెద్దలు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కల్వకుర్తి హస్తగతం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

జరగనున్న మున్సిపల్ ఎన్నికలలోకూడా అభివృద్ధికి పట్టం కట్టే విధం గానే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి కల్వకుర్తి అభి వృద్ధికి దోహదపడతారని ఆయన ఆకాంక్షి ంచారు.ఎవరెన్ని కుట్రలు చేసి నా, ఎన్ని ప్రలోభాలకు గురిచేసిన ప్రజలు ఒక నిర్ణయం పైనే ఉన్నారని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కంకణ బద్ధలై ఉన్నా రన్నారు.బీఆర్ఎస్, బీజేపీనాయకుల మోసపూరిత మాటలు, మొసలి కన్నీళ్లు చూసి మోసపోవుదని, కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో ఉన్న అభ్యర్థులను గెలిపించి కల్వకుర్తి మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగుర వేయాలని మంత్రి పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం చివరి రోజు కావడంతో పట్టణంలోని 22 వార్డుల అభ్యర్థులు, కార్యకర్తలతో కలిసి పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట భారీ రోడ్ షో నిర్వ హించారు.ఈ ర్యాలీకికాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు భారీగా తరలివచ్చి కల్వకుర్తి పట్టణాన్ని జన సందోహం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలింగ్ నిర్వహణపై నిశిత పరిశీలన జరపాలి

(మొదటి పేజీ తరువాయి)

శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీతాలక్ష్మి కీలక సూచనలు చేశారు. మైక్రో అబ్జర్వర్లను ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయిస్తామని తెలిపారు. పోలింగ్‌కు ముందు రోజు ఉదయం 9గంటలకే డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకో వాలని సూచించారు. పోలింగ్ సిబ్బందికి అందే సామగ్రి సక్రమంగా ఉందా లేదా పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపా యాలు, సీక్రెట్ పోలింగ్ కంపార్ట్‌మెంట్ ఏర్పాటు సరిగా ఉందో గమనిం చాలని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందా లేదా నిశితంగా పరిశీలించాలన్నారు.టెండర్,ఛాలెంజ్ ఓటింగ్‌జరిగితే వివరాలు నమోదు చేయాలని సూచించారు. పోలింగ్ విధుల్లో జోక్యం చేసుకో కుండా పరిశీలనవరకే పరిమితమవ్వాలనిస్పష్టం చేశారు. ఓటింగ్‌గోప్య తనుకాపాడుతూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహిం చాలనిసూచిం చారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

## మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

ఏఎంసీ వైస్ చైర్మన్ జవాజి శేఖర్ గౌడ్

**రాజాపూర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** మహబూబ్ నగర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో నిలిచిన అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని రాజాపూర్ మండల ఏఎంసీ వైస్ చైర్మన్ జవాజి శేఖర్ గౌడ్ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని 50వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ జాకీర్ మొహియుద్దీన్ తరపున ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపినాథ్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిర్మలాపూర్ యాదయ్య తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ గెలుపుపే లక్ష్యంగా నాయకుల ప్రచారం

**నవాబుపేట,ఫిబ్రవరి9 ప్రభాతవార్త:** కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా జడ్చర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తోపాటు మండల నాయకులు పాలమూరు కేంద్రంలో జరిగే కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల ప్రచారంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం నవాబుపేట మండల సీనియర్ కాంగ్రెస్‌నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు.సర్పంచులు ఉపసర్పంచు లు మండల వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల ప్రచారంలో పాల్గొని ప్రజానాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తో పాటు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.